

జాతరలో అపశ్రుతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన జాతరలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఎడ్ల పరుగు పోటీల్లో ఓ ఎడ్లబండి అదుపుతప్పి ఓ వ్యక్తిపైనుంచి వెళ్లడంతో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం....

కృష్ణరాయుడుపేటలో బుధవారం జాతర జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో ఓ ఎడ్ల బండి అదుపుతప్పి కళ్లాల వైపు దూసుకెళ్లింది. కళ్లాల్లో ఉన్న కోటపాడు మండలం రామయ్య అగ్రహారానికి చెందిన ఇండిగిబల్లి సన్యాసిరావు అలియాస్ దేముడునాయుడు(48)పై నుంచి ఎడ్లబండి చక్రాలు వెళ్లడంతో అస్వస్థతకు గురయ్యాడు. గుండెలో నొప్పివస్తుందని స్నేహితులకు చెప్పడంతో ఆటోలో కోటపాడు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మరణించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దేవి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎప్పటికి పరిష్కారమవుతాయో..!

రెవెన్యూ సమస్యలపై అర్జీదారుల్లో ఆందోళన

గత ప్రభుత్వంలో చేపట్టిన రీ-సర్వేలో జరిగిన తప్పిదాలు, పొరపాట్ల వల్ల నా పేరున ఉన్న వ్యవసాయ భూమి ఆన్‌లైన్ పోర్టర్‌లో హోల్డ్‌లోకి వెళ్లింది. దీంతో వన్‌బి తీయడం సాధ్యపడటం లేదు. ఫలితంగా బ్యాంకు రుణం తీసుకోవడానికి సాధ్యం కాలేదు. అంతే కాదు, ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ రాయితీలకూ అవకాశం లేకపోయింది. ఇదే సమస్యను ఇటీవల మా గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు దరఖాస్తు రూపంలో అందజేశాను. ఎప్పటికి పరిష్కారమౌతుందో చెప్పలేదు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురౌతున్నాను.

– ఇదీ గుర్ల మండలం పల్లిగండ్రేడు గ్రామానికి చెందిన రెల్లి అప్పలనాయుడు ఆవేదన

చెరకుపల్లి పరిధిలోని నా పొలం తాకట్టు పెట్టి బ్యాంకు రుణం తీసుకున్నాం. మా దగ్గర ప్రస్తుతం డబ్బులు లేకపోయినప్పటికీ రీషెడ్యూల్ కోసం బ్యాంకు వెళ్లాం. తీరా అక్కడికి వెళ్లాక వన్‌బి అందుబాటులో లేకపోవడంతో కుదరదని చెప్పారు. దీంతో రూ.2 లక్షలు అప్పుచేసి తీర్చాం. తిరిగి అప్పు కోసం ప్రయత్నించినా బ్యాంకర్లు వన్‌బి తప్పనిసరి అంటున్నారు. అప్పుడు తెలిసింది... బ్యాంకులో మేము రుణం తీసుకున్న తరువాత రుణం తీసుకున్న తరువాత జరిగిన రీసర్వేలో ఏవో తప్పులు జరిగాయని! అందువల్లే ఇప్పుడు ఆన్‌లైన్‌లో మా భూమి వివరాలు అందుబాటులో లేవని. ఈ సమస్య వెంటనే అధికారులు పరిష్కరించకపోతే ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఇదీ దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన సుంకరి సీతారం పరిస్థితి.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ (ఫైల్)

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఇలా ఒకరు, ఇద్దరు కాదు... సుమారు 5 వేల మంది రైతులు ఇటువంటి రెవెన్యూ సమస్యలతో సతమతమౌతున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలు ఎప్పటికి పరిష్కారమౌతాయో? ఇంతకీ పరిష్కరిస్తారా? లేక గత ప్రభుత్వం మాదిరిగా ఉత్తుత్తి హడావుడేనా? అన్న సందేహాలు నెలకొన్నాయి. ఇటీవల నెల రోజుల పాటు గ్రామాల్లో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన విషయం విదితమే. గత నెల 6న మొదలైన రెవెన్యూ సదస్సులు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా 983 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఇందులో 40,320 మంది పాల్గొన్నట్టు అధికార యంత్రాంగం భావిస్తోంది. మొత్తం 6,764 దరఖాస్తులు అందినట్టు అధికారిక సమాచారం. వినతులు తీసుకోవడం తప్ప, వాటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పకపోవడంతో అర్జీదారులు అయోమయానికి గురౌతున్నారు. మొత్తం అర్జీల్లో ఇప్పటికే 2,468 దరఖాస్తులకు పరిష్కారం చూపినట్టు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 4,296 దరఖాస్తులు నిర్దిష్టమైన కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కూడా అంటున్నారు.

అందిన దరఖాస్తుల్లోనూ ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబీకులే ఉన్నారు. అత్యధికంగా పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం 4,854 అర్జీలు అందాయి. రీసర్వేలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని 345, సరిహద్దు సమస్యలను ప్రస్తావిస్తూ 268, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, తప్పుల సవరణ చేయాలని 250 మంది, తమ పట్టాలను సబ్ డివిజన్ చేయాలని మరో 143మంది అర్జీలు పెట్టుకున్నారు. మిగిలిన వాటిలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, ఇనాం భూముల సమస్యలు, రోడ్ల నిర్మాణాలకు ఎదురౌతున్న ఇబ్బందులు తదితరాలపై అర్జీలు అందాయి.

పండగపూట విషాదం

- బైక్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- అక్కడికక్కడే ఇద్దరు యువకులు మృతి
- చందకపేటలో విషాద ఛాయలు
- రామవరం వద్ద మరొకరు దుర్మరణం





మృతి చెందిన యువకులు



లవణ్‌కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి-బొండపల్లి

పండగపూట విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. బొండపల్లి మండలం గొట్లాం వద్ద జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ... మోటారు బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. గంట్యాడ మండలం రామవరం వద్ద సంభవించిన ప్రమాదంలో మరో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ యు.మహేష్ కథనం ప్రకారం...

మండలంలోని బొండపల్లి పంచాయతీ పరిధిలోని చందకపేట గ్రామానికి చెందిన వెలుగుల లవణ్ కుమార్(25) తో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ రంజాన్ దాస్ (25) బైక్‌పై వస్తున్నారు. గొట్లాం జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ వారిని బలంగా ఢీకొంది. దీంతో లవణ్ కుమార్, లక్ష్మణ్ రంజాన్ దాస్ అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌ను లారీ వంద అడుగుల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతిచెందిన ఇద్దరు యువకులు గజపతినగరంలోని రిలయన్స్ ట్రెండ్స్ బట్టల దుకాణంలో పనిచేస్తున్నారని ఎస్ఐ మహేష్ తెలిపారు. లవణ్‌కుమార్‌కు భార్య చైతన్య లక్ష్మి, నాలుగు నెలల వయసు గల కుమారుడు దేవ దీక్షిత్ ఉన్నారు. దేవ దీక్షిత్‌కు ఈ నెల 19న బారసాల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో తండ్రి లవణ్ కుమార్ మరణించాడు. దీంతో చందకపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గంట్యాడ : మండలంలోని రామవరం వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన కె.ప్రకాశరావు విజయనగరం కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఆటో ఎక్కి రామవరం వస్తున్నాడు. మార్గం మధ్యలో కారును ఆటో ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఆయన ఫోన్ నెంబర్ గాని, బంధువుల ఫోన్ నెంబర్ గాని దొరకలేదని, ఎవరికైనా ఈయన ఆచూకీ తెలిస్తే 9121109442 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సాయికృష్ణ కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

రామభద్రపురం : మండల పరిధిలోని ఆరికతోట జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న లారీని రామభద్రపురం నుంచి వస్తున్న కారు వెనుకనుంచి ఢీకొట్టింది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించుకొనే క్రమంలో లారీని ఢీ కొట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పాడవగా లోపల ఉన్న వారు క్షేమంగా బయటపడటం విశేషం.



బొబ్బిలిలో కిటకిటలాడుతున్న చికెన్ షాపులు

కొండెక్కిన కోడి

- భారీగా పెరిగిన చికెన్ ధరలు
- కిక్కిరిసిన మటన్, చికెన్ షాపులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనుమ పండుగ నేపథ్యంలో మాంసం ధరలు కొండెక్కాయి. బుధవారం నగరంలో మటన్, చికెన్, చేపల షాపులు రద్దీగా మారాయి. నగరంలో ఏ షాపు వద్ద చూసినా అధిక సంఖ్యలో మాంసం కోసం క్యూ కట్టారు. ఇదే అదునుగా మొన్నటి వరకు ఉన్న కిలో చికెన్ ధర రూ.160 నుంచి రూ.200, రూ.220 కు పెంచారు. మటన్ రూ.800 నుంచి రూ.వెయ్యికి పెంచేశారు. చేపలు రూ.130 నుంచి రూ.150కు పెంచి విక్రయించారు. దీంతో ధరలను చూసి మాంసాహార ప్రియులు బెంబేలెత్తిపోయారు.

బొబ్బిలి : సంక్రాంతి, కనుమ వేళ మాంసం ధరలు చుక్కల్ని చూపిస్తున్నాయి. కనుమ సందర్భంగా మాంసానికి మంచి గిరాకీ ఏర్పడడంతో వాటి ధరలు ఆకాశాన్ని తాకాయి. సాధారణ రోజులు కంటే కనుమ రోజు ధరలు పెరగడంతో సామాన్యులు గిలాగిలలాడుతున్నారు. బొబ్బిలి పట్టణంలో స్కిన్‌లెస్ చికెన్ రూ.230 నుంచి రూ.250, స్కిన్‌తో చికెన్ రూ.180 నుంచి రూ.200, మటన్ కిలో రూ. వెయ్యి, చేపలు లైవ్ రూ.250, ఐస్ చేపలు రూ.200కు ధరలు పెరిగాయి. మాంసం, చేపలు ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆనాటి సంక్రాంతులేవి..?

- దయనీయంగా క్వారీ బతుకులు
- క్వారీ పనులు లేక... వలస బాట
- ఇతర పనుల కోసం వెతుకులాట
- ఆందోళనలో క్వారీ కార్మికులు

ప్రజాశక్తి – జామి

సంక్రాంతి వచ్చిందంటే రైతాంగంతో పాటు కార్మిక బతుకుల్లోనూ ఆనందాలు వెల్లివిరిసేవి. మరీ ముఖ్యంగా క్వారీ పనులు చేసే కుటుంబాల్లో సంక్రాంతులు సందడి చేసేవి. కానీ గత కొన్నేళ్లుగా క్వారీ బతుకులు ఉపాధి గల్లంతు కావడంతో... సంక్రాంతి, దసరా పండుగలు కార్మిక బతుకుల్లో కానరావడం లేదు. ప్రభుత్వం సరైన మైన్స్ విధానం తీసుకురాకపోవడం, క్వారీల్లోకి కార్పొరేట్లు చొరబడడంతో రోజురోజుకూ క్వారీ పనులు కనుమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న పరిస్థితులు దాపురించాయి. జామి గ్రామంలో క్వారీల ఆవాసాలను పరిశీలిస్తే, కార్మికుల దయనీయ బతుకుల తీరు తెన్నులు ఇట్టే అర్థమైపోతాయి.



పనులు నిలిపేయడంతో మూతపడిన క్వారీ

జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీలు సంక్షోభంలో ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వ మైనింగ్ విధానంతో సగానికి పైగా మూతబడ్డాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రాయల్టీ ప్రయివేటు విధానంతో ఉన్న వారి బతుకులు రోడ్డున పడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఆ విధానాన్నే అమలు చేయడంతో క్వారీలు, అందులో పని చేసిన వారి కార్మిక బతుకులు ఇబ్బందుల్లో ఉన్నాయి. ప్రధానంగా జామి మండల కేంద్రంలో మాధవరాయమెట్ట వద్ద క్వారీ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేవి. మాధవరాయమెట్ట గ్రామంలో 500కు పైగా కార్మికులు క్వారీలపై బతికేవారు. జామి గ్రామంలోని ఒక్క దళిత కాలనీ నుంచి వందల కుటుంబాలు సొసైటీ క్వారీలో పనులు చేసుకుని, తాతలు తండ్రుల నుంచి జీవనం సాగిస్తున్నాయి. క్వారీ పనులు తప్ప, మరే పనులు తెలియని దళిత కుటుంబాలకు ప్రభుత్వ తీసుకొచ్చిన ప్రయివేటు విధానం పొట్ట కొట్టింది. దీంతో కార్మిక కుటుంబాలు చెల్లాచెదురైన పరిస్థితి నెలకొంది. కుటుంబం గడవక, ఇతర ఉపాధి మార్గాల కోసం వలసలు పోయేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి. ఉన్న కొద్దిపాటి కార్మికులు కూడా పూట గడవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఇలా ఒకప్పుడు కళకళలాడిన క్వారీలన్నీ నేడు వెలవెల బోతున్న పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా క్వారీల ఆవాసాలను పరిశీలిస్తే, కార్మికుల దుర్భర పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు.

పేదలకు అన్యాయం

ప్రభుత్వ యంత్రాంగం పేదలకు ఒకలా, బడా వ్యాపారులకు మరోలా పనిచేస్తుందనడానికి జామి క్వారీలే ఉదాహరణ. జామిలో బడా కాంట్రాక్టులతో సొసైటీ పేరున దళిత కుటుంబాలు క్వారీ పనులు చేసుకునేవి. అయితే క్వారీల సమీపం నుంచి జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో దళితులు పని చేసే క్వారీలను అధికారులు నిలుపుదల చేశారు. కానీ అదే రోడ్డు నిర్మాణం కోసం అడ్డదారుల్లో క్వారీలు తీసుకున్న రోడ్డు కాంట్రాక్టర్ మాత్రం యథేచ్ఛగా క్వారీలు నిర్వహిస్తున్నారు. ప్రజా ప్రాజెక్ట్ పేరు చెప్పి, క్వారీలు తీసుకుని ఆ ప్రాజెక్ట్ పనులు పూర్తయినా, క్వారీలు తవ్వి వ్యాపారం చేస్తున్న పరిస్థితి. సామాన్యులు పనిచేసే సొసైటీ క్వారీలను మాత్రం అధికారులు తరచూ దాడులు చేసి నిలిపేస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే సంక్రాంతులు లేకుండా పోయాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాబోయ్ గ్రోత్‌సెంటర్ రోడ్లు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- రహదారిపై పెద్ద గోతులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- మొయిలీ పరిశ్రమ వెనక్కి వెళ్లినా చలనం లేని ఎపిఐఐసి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పారిశ్రామికవాడలో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక వాడలో రోడ్లు చూసి నూతన పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు. అయినా ఎపిఐఐసి అధికార్లులో చలనం లేదు. రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు కోరుతున్నారు.

గ్రోత్ సెంటర్‌లో రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఎక్కడికక్కడ ఏర్పాడ్డాయి. ఆర్‌డిఒ కార్యాలయం జంక్షన్ నుంచి హెరిటేజ్, హిరా, బెర్రీ పరిశ్రమలకు వెళ్లే రహదారి, ఎస్ఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి సహారా, అరోరా పరిశ్రమలకు వెళ్లే రోడ్డు కూడా పాడైపోవడంతో వాహనదారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమలకు ముడి సరుకు తీసుకు వచ్చేందుకు, పరిశ్రమల్లో తయారు అయ్యే ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కంపెనీల యజమానులు తలలు పట్టుకుంటున్నారు. వర్షాకాలంలో గుంతల్లో లారీలు కూరుకుపోవడంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లు నరకం అనుభవిస్తున్నారు. గోతుల రోడ్లుతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని లారీలు, వ్యాన్ల యజమానులు, డ్రైవర్లు వాపోతున్నారు.

మౌలిక సౌకర్యాలు లేక..

గ్రోత్‌సెంటర్లో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం లేదు. విశాఖ నుంచి గ్రోత్ సెంటర్ పరిశ్రమలకు ముడి సరుకు తేవాలన్నా, పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తిని తీసుకెళ్లాలన్నా రోడ్డు మార్గం ద్వారా తరలించాలి. రోడ్డు మార్గంలో రవాణా చేయడంతో రవాణా ఖర్చులు అధికంగా ఉండడంతో గ్రోత్‌సెంటర్లో పరిశ్రమలు పెట్టలేమని మొయిలీ, బికె స్టీల్, వైజాగ్ ప్రొఫైల్ యాజమాన్యాలు ముందుకు రావడం లేదు. మొయిలీ యాజమాన్యం పూర్తిగా తమకు కేటాయించిన భూమిని వెనక్కి ఇచ్చేసింది. బికె స్టీల్‌కు కేటాయించిన భూమిని ఎపిఐఐసి వెనక్కి తీసుకుంది. వైజాగ్ ప్రొఫైల్ పరిశ్రమ భూములు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రోత్ సెంటర్ రహదారులు గోతులమయంగా మారడంతో పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు వెనకడుగు వేస్తున్నారు. రోడ్లు నూతనంగా నిర్మించాలని పారిశ్రామిక వేత్తలు, కార్మికులు కోరుతున్నారు.



అధ్వానంగా తయారైన రోడ్డు





జనాల్లేక వెలవెలబోయిన ఎత్తు బ్రిడ్జి జంక్షన్, మయూరి జంక్షన్

బోసిపోయిన నగరం

సంక్రాంతి పండుగ నేపథ్యంలో విజయనగరం బోసిపోయింది. రెండు రోజుల క్రితం వేలాది మందితో కిటకిటలాడిన నగరం బుధవారం కళతప్పి బోసిపోయింది. షాపులన్నీ మూతపడ్డాయి. రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రధానంగా నగరంలో మూడు లాంతర్లు, గంటస్తంభం, రైల్వేస్టేషన్ రోడ్డు, మయూరి జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్, ఎంజి రోడ్డు.. ఇలా అన్నీ ప్రధాన ప్రాంతాలు జనాలు లేక వెలవెలబోయాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలో జనాలు పల్లెలకు వెళ్లడం, నగరంలో పాదచారులు, వాహనాలు తిరగకపోవడం వల్ల నగరంలో కర్ఫ్యూ విధించారా? అన్న చందంగా రోడ్లు, ప్రధాన జంక్షన్లు దర్శనమిచ్చాయి.

–ప్రజాశక్తి, విజయనగరం టౌన్

జ్యూట్ కార్మికులకు బోనస్ చెల్లించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్ మిల్ యాజమాన్యం బోనస్ వెంటనే చెల్లించాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం 2023 బోనస్ ఈ నెల 8న చెల్లిస్తానని చెప్పి మాట తప్పిందన్నారు. యాజమాన్యం తన బినామీల ద్వారా బోనస్ చెల్లించడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం వచ్చినా, ఇంతవరకు బోనస్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడం భావ్యం కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ అధికార్లు స్పందించి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని రామారావు హెచ్చరించారు.

కూలేందుకు సిద్ధంగా తుపాను షెల్టర్

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం గ్రామంలో తుపాను షెల్టర్ కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రమాదకరమైన తుపాను షెల్టర్ పక్క నుంచే విద్యార్థులు నిత్యం రాకపోకలు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే ఈ తుపాను షెల్టర్ పక్కనుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అందుకు అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్‌ను కూల్చి వేయాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న తుపాను షెల్టర్ పక్క నుంచి వెళ్తున్న విద్యార్థులు


బహుమతులు అందజేస్తున్న జెసి రాజు, రమేష్‌నాయుడు

సంక్రాంతికి ప్రత్యేక ఆకర్షణ రంగవల్లులే

ప్రజాశక్తి-బొబ్బిలి

పండగలలో ప్రత్యేకించి సంక్రాంతికి ఆకర్షణగా నిలిచేవి రంగవల్లులేనని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. సంక్రాంతి సందర్భంగా పాత బొబ్బిలి నాయుడు వీధి యువత ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు పర్యవేక్షణలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులను జెసి రాజు, రమేష్ నాయుడు అందించారు. కార్యక్రమంలో చోడిగంజి రవి, కౌన్సిలర్ రాములు, ఎ.సన్యాసిరావు, ఆర్.మురళి, నాగు, ధనుంజయ, అజయ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు

విజయనగరం టౌన్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీ సాయి కృష్ణ వాకర్స్ క్లబ్, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న బిసి కాలనీలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు, పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు. కొంతమంది బాలికలకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఉద్యమ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు , ఎలక్ట్ గవర్నర్ ఎ. తిరుపతిరావు, సభ్యులు ముజ్జ శ్రీనివాసరావు, త్యాడ రామకృష్ణారావు, యాగాటి నలమారాజు పాల్గొన్నారు. నిర్వహించారు.


బహుమతులు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

శతాబ్దాల చరిత్రకు సాక్ష్యాలు తీర్థాలు

- కొనసాగుతున్న సంస్కృతీ సంప్రదాయాలు
- శృంగవరపుకోట నియోజకవర్గంలోనే అత్యధికం

ప్రజాశక్తి-వేపాడ

శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో నేటికీ తీర్థాలకు పెద్దపీట వేస్తున్నారు. నియోజవర్గంలోని జామి, శృంగవరపుకోట, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస మండలాల పరిధిలో అత్యధిక గ్రామాల్లో తీర్థాలు కొనసాగుతున్నాయి. తీర్థాల్లో అనేక ప్రత్యేకతలున్నాయి. సంక్రాంతి పండగను పురస్కరించుని మళ్లీ మహా శివరాత్రి, ఆషాఢం వరకు జరిగే గ్రామదేవతల పండగలకు నేటికీ వేలాదిగా జనం తరలిరావడం ఒక ప్రత్యేకత.

సంక్రాంతి పండగకు ఎంతటి వారైనా సొంతూరికి వచ్చి, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం. అలాగే గ్రామాలకు చేరిన వారంతా ఒకచోటికి చేరి సరదాగా గడపడం ఒక ప్రత్యేకత. అలాంటి జన సమూహమే ఒక తీర్థం... తీర్థమహోత్సవం. అలాంటి తీర్థాలకు పల్లెలు పుట్టినిల్లులనే చెప్పాలి. శతాబ్దాల చరిత్రకు నిలువుటద్దంగా నిలుస్తున్న గ్రామీణ తీర్థాలు... పల్లె సంప్రదాయాలను నేటి తరానికి పరిచయం చేస్తున్నాయి. శృంగవరపుకోట నియోజకవర్గంలో సంక్రాంతి నుంచే ప్రారంభమయ్యే తీర్థ మహోత్సవాలే అందుకు నిలువెత్తు సాక్ష్యం. ఒకప్పుడు గ్రామీణ కళలు, పల్లె సంప్రదాయాలను ప్రోత్సహించే విధంగా జరిగే తీర్థాలు.. నేడు వాటి గతి తప్పుతున్నాయనే చెప్పాలి. ఏదేమైనా నాటి తరాల సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో వీటి పాత్ర ఎనలేనిది.

పల్లె సంస్కృతికి పెద్దపీట

ప్రధానంగా తీర్థాల్లో పల్లె సంస్కృతికి పెద్దపీట వేస్తున్నారు. గ్రామదేవతలను ముడుపులు చెల్లించడమే కాదు, వాటి వెనుక ఎన్నో గ్రామీణ కళలను పెంచిపోషిస్తున్నారు. తీర్థాల్లో ప్రధానంగా జానపద కళలతోపాటు నాటికలు, బుర్రకథలు, తప్పెటగుళ్లు, కోలాటాలు, బల్లవేషాలు, పులివేషాలు ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో నేటికీ ఎడ్లబండ్ల పోటీలు, గుర్రపు పందేలు నేటికీ జరుగుతున్నాయి. వీటితో పాటు ఆటలు పోటీలు, సంగిడిరాళ్ల ఎత్తడం వంటి గ్రామీణ ఆటలకు పెద్దపీట వేస్తున్నారు. మనిషిలో మానసిక వికాసాన్ని కలిగించడంతోపాటు పల్లె సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నదే వీటి అంతిమ లక్ష్యం. అందులో భాగంగానే ఇప్పటికే సంప్రదాయ బద్ధంగా సాగుతున్న గ్రామీణ తీర్థాలకు తండోపతండాలుగా జనం తరలి రావడం, వారి వారసత్వాన్ని నిర్వహించుకోవడం గొప్ప విషయంగా చెప్పక తప్పదు.

కుటుంబ వ్యవస్థ బలోపేతం

గ్రామాల్లో పండగలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్నా తీర్థాలకు ఒక ప్రత్యేకత ఉంది. గ్రామానికి నలుదిక్కులా ఉన్న ప్రజలతోపాటు కుటుంబసభ్యులను, తోబుట్టువులను, రక్త సంబంధీకులను, స్నేహితులను విధిగా ఆహ్వానించడం ఆనవాయితీ. ఇరుగుపొరుగుతోపాటు పండగకు వచ్చిన వారికి పిండివంటలు వండి పెట్టడం, రక్త సంబంధీకులకు నూతన వస్త్రాలు అందించడం నేటికీ కొనసాగుతోంది. ఇది కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ఇరుగుపొరుగు వారితో స్నేహ సంబంధాలు పెంపొందించుకోవడంలో ప్రధాన భూమిక పోషిస్తుందనే చెప్పాలి.


జాతరలో నిర్వహిస్తున్న ఎడ్ల పరుగు పోటీలు(ఫైల్)

అన్ని వయస్సుల వారూ సరదాగా..

జనమంతా ఒక దగ్గర చేరడంతో ఆ ప్రాంతం ఉత్సవంగా మారుతుంది. సంక్రాంతికి సొంత గ్రామాలకు చేరుకున్న వారంతా పండగ అనంతరం జరిగే తీర్థాల్లోనూ పాల్గొంటారు. పిల్లాపాపలతో ఇంటిల్లిపాదీ తీర్థాల్లో ఆనందంగా గడుపుతారు. తీర్థాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, ఉత్సాహంగా గడుపుతారు. ప్రస్తుతం తీర్థాల్లో బుర్రకథలే కాకుండా మ్యూజికల్‌నైట్లు, డ్యాన్స్‌బేబీ డ్యాన్సులు పెట్టడంతో యువత కేరింతలు కొడతారు. చిన్నపిల్లలకు బొమ్మల కొలువుల్లా చిన్న చిన్న ఆటవస్తువులు, బెలూన్లు వంటివి తీర్థాల్లో ఎక్కువగా దొరుకుతాయి. దీంతో గ్రామాల్లో జరిగే తీర్థాలకు చిన్నపిల్లలు ఆసక్తిగా వెళ్తుంటారు. వృద్ధులు పౌరాణికి నాటికలు, డ్రామాలను తిలకించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇలా అన్ని వయస్కుల వారిని అలరించే విధంగా తీర్థాలు నిర్వహిస్తుండటం ఒక ప్రత్యేకత.

వినోదం.. వికృత రూపం

తాజా తీర్థాల్లో గ్రామీణ కళలకు చోటు దక్కడం లేదన్న వాదనలూ ఉన్నాయి. వినోదం కోసం కొన్ని చోట్ల వికృత రూపాల వైపు దారి మళ్లిస్తున్నారు. కొన్నేళ్ల కిందట గ్రామంలోనే నాటిక ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపేవారు. నేడా పరిస్థితి తగ్గి, వినోదాలు కాస్త వెర్రితలలు వేస్తున్నాయి. పండగ అంటే పేకాట, కోడిపందేలు, మద్యం సేవించడం అనే పరిస్థితి వచ్చేసింది. పండగ అంటేనే సరదా... అందులోనూ తీర్థాల్లో విందు, వినోదాలకు ప్రాధాన్యత ఎక్కువ, వీటినే వినోదంగా భావించినచోట కొన్ని సందర్భాల్లో విషాదంగానూ మారుతోంది. దీనివల్ల గ్రామీణ సంస్కృతి విషతుల్యంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని సరిచేసుకుని నిజమైన గ్రామీణ కళలకు, సంప్రదాయాలకు వేదికగా మార్చుకుంటేనే నేడు గ్రామీణ కళలు బతికి బట్ట కడతాయన్నది పెద్దల మాట.

జూదాన్ని సంతరించుకుంటున్న సరదా..

గ్రామాల్లో జరిగే తీర్థాల్లో రహస్యంగా కోడిపందేలు, జూదపు ఆటలకు యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. తీర్థాల పేరుతో ఆ చుట్టుపక్కల పొలాలు, కళ్లాల్లోనూ కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీ మారిపోయింది. బల్లాటలు, కాయ్‌రాజా కాయ్ వంటి ఆటల్లో చిన్నపిల్లల్ని మోసగించి, వారి నుంచి డబ్బు కాజేస్తున్నారు. పిల్లలు, పెద్దలు కూడా అదృష్టం పరీక్షించుకునే పేరుతో డబ్బు పోగొట్టుకుంటున్నారు. పోలీసులు వీటిని నిరోధించాల్సి ఉన్నా, చోద్యం చూస్తున్నారనే చెప్పాలి. గ్రామీణ పండగలను, తీర్థాలను సక్రమమైన రీతిలో జరుపుకుని భావితరాలకు సంస్కృతీ సంప్రదాయాలను అందించాలన్నది ప్రజల మాట.


సంగిడిరాయి ఎత్తుతున్న వ్యక్తి (ఫైల్)

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-వేపాడ

శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని చినగుడిపాల గ్రామస్తులు.. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణను కోరారు. బుధవారం మండలంలో పర్యటించిన కృష్ణ దృష్టికి వారు పలు సమస్యలను తీసుకెళ్లారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న రైవాడ కాలువపై కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ స్పందిస్తూ సమస్యలను ఎంపి శ్రీభరత్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో చినగుడిపాల గ్రామానికి చెందిన యువకులు జన దేవరాజు, మాజీ సర్పంచ్ ఎస్.దేవుడి నాయుడు, ఎల్.ముసలినాయుడు, టి.శ్రీను, ఎల్.అప్పన్న, కె.సత్యం, బి.సన్యాసినాయుడు, ఎల్.గంగునాయుడు, దేవుడు, ఎల్.సన్నిబాబు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీషా

బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శిరీషా

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో హోమియో వైద్యులుగా మానుబల్ల శిరీషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులందరికీ అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తానని తెలిపారు.


అర్థాంతరంగా వదిలేసిన రాజీవ్ గృహకల్ప ఇళ్లు

నిరుపయోగంగా రాజీవ్ గృహకల్ప సముదాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ పేదల కోసం కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రాజీవ్ గృహకల్ప పథకాన్ని అమలు చేశారు. అందులో భాగంగా ఐటిఐ కాలనీ సమీపంలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాలుగు బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఒక బ్లాకులో మూడు శ్లాబులు, మూడు బ్లాకుల్లో రెండు శ్లాబులు వేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. దీంతో ఇళ్ల సముదాయం నిరుపయోగంగా మారింది. శ్లాబులు వేసి పదేళ్లు పూర్తి కావడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రభుత్వం స్పందించి రాజీవ్ గృహ కల్ప సముదాయాలను ప్రజావసరాలకు ఉపయోగ పడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పందులకు నిలయంగా ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ పందులకు నిలయంగా మారింది. కాంప్లెక్స్ పరిసర ప్రాంతమంతా మురుగునీటితో ఉండడంతో పందులకు నిలయమైంది. ఆర్‌టిసి కాంప్లెక్స్ షాపుల్లో వాడుక నీరు బయటకు వెళ్లేలా మురుగునీటి కాలువలు లేవు. దీంతో కాంప్లెక్స్ ఆవరణలో మురుగునీటి నిల్వ ఉంటోంది. దీనివల్ల దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధి చెంది వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందులు నిత్యం ఉండడంతో అపారిశుధ్యం పేరుకుపోతోంది.

కోటదుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల కోట దుర్గమ్మను అమ్మవారిని సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహధికారి సూర్యనారాయణ వారికి సాదరంగా స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీరామ సత్యనారాయణ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. హైకోర్టు జడ్జి అనుపమ చక్రవర్తి అమ్మవారిని దర్శించుకున్నారు.

మంచిమనసు చాటుకున్న 'గొంప'

- రైవాడ కాలువపై కర్రల వంతెన ఏర్పాటు
- బల్లంకి గ్రామస్తులకు తాత్కాలిక ఉపశమనం


కర్రల వంతెనను పరిశీలిస్తున్న గొంప కృష్ణ, గొంప వెంకటరావు, నాయకులు

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు మరోసారి మంచిమనసు చాటుకున్నారు. మండలంలోని బల్లంకి, ఆనందపురం గ్రామాల మధ్య రైవాడ కాలువపై ఉన్న కల్వర్టు ఇటీవల కూలిపోయిన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బానాది ఎంపిటిసి గొంప తులసి సెగ్మెంట్ పరిధిలో ఉంది బల్లంకి గ్రామం. దీంతో గొంప వెంకటరావు, తులసి దంపతులు స్పందించి, సమస్యను జివిఎంసి అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. గొంప కృష్ణ స్పందించి కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. అందుకు స్పందించిన అధికారులు అంచనా వేసి, పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారు. అయితే, ఈ నెల 26న బల్లంకి గ్రామంలో మరిడిమాంబ జాతర జరగనుంది. దీంతో ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు రాకపోకలకు అంతరాయం కలగకూడదని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు భావించారు. దీంతో కాలువపై కర్రలతో వంతెన ఏర్పాటుచేశారు. దానిపై మట్టి పోయించి, వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీనికి సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, ఉప సర్పంచ్ పల్లె ధనుంజయ సహకారం అందించారు. దీంతో బల్లంకి గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

కర్రల వంతెనను పరిశీలించిన కృష్ణ

రైవాడ కాలువపై ఏర్పాటుచేసిన కర్రల వంతెనను బుధవారం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాజీపేట, చినగుడిపాల, నల్లబెల్లి, వావిలపాడు, కడకొండ వద్ద కూడా కల్వర్టులు శిథిలావస్థకు చేరాయని, వాటిని కూడా పునర్నిర్మాణం చేపట్టేందుకు జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. రెండు మూడు రోజులు పరిశీలిస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, మాజీ సర్పంచ్ బి.నాగరాజు, ఉపసర్పంచ్ పల్లె ధనుంజయ, అడ్వకేట్ గుమ్మడి రవికుమార్ పాల్గొన్నారు.


శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బి అతిథి గృహం ఇదే

శిథిలావస్థలో ఆర్‌అండ్‌బి బంగ్లా

ప్రజాశక్తి-బొబ్బిలి

ఒకప్పుడు ఎంతోమంది విఐపిలకు ఆతిథ్యం ఇచ్చే అతిథి గృహం నేడు ఎటువంటి ఆదరణకూ నోచుకోవడం లేదు. ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు ఆతిథ్యం ఇచ్చే రహదారి, భవనాల శాఖ బంగ్లా నిర్వహణ కరువవడంతో శిథిలావస్థకు చేరింది. గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు బొబ్బిలి పరిసర ప్రాంతాలకు వస్తే ఆర్ అండ్ బి బంగ్లాలో సేద తీరేవారు. పదేళ్ల క్రితం వరకు బంగ్లా నిర్వహణ బాగుండేది. తర్వాత నిర్వహణ లేకపోవడంతో బంగ్లా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో బొబ్బిలి ప్రాంతానికి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు హోటళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి బంగ్లాను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.


మొక్కలను పంపిణీ చేస్తున్న హరిత సొసైటీ సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ప్రజాశక్తి-వేపాడ

పర్యావరణ పరిరక్షణ అందరి జీవితాల్లో భాగం కావాలని హరిత సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. సంక్రాంతి సందర్భంగా హరిత సొసైటీ సభ్యులు వంటాకు రామసత్యం, వెంకటలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో జగ్గయ్యపేట గ్రామంలో కూలీకి వెళ్లలేక అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు దుప్పట్లు, చీరలతోపాటు కొంత ఆర్థిక సహాయం అందించారు. ప్రతి గ్రామంలో యువత తమకు తగిన రీతిలో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. పాత సింగరాయి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జరిగిన ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి హరిత సొసైటీ తరపున గులాబీ మొక్కను ప్రోత్సాహకంగా అందించారు. కార్యక్రమంలో హరిత సొసైటీ సభ్యులు పి.మహేష్, జి.భానుమూర్తి, ఆర్.కృష్ణ, బి.ప్రవీణ్, జి.ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలవలసకు ఘన నివాళి

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైసిపి పాలవలస రాజశేఖర్ మృతికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను, రాజశేఖర్ సతీమణి రేగిడి జడ్పిటిసి ఇందుమతిని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. మంగళవారం రోజు రాజాం, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కొండ్రు మురళీమోహన్ గోండు శంకర్ పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాసు, మాజీఎమ్మెల్యే కళావతి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, దేవాదాయ శాఖ స్పెషల్ చీఫ్ కార్యదర్శి శ్రీరామ సత్యనారాయణతో పాటు చుట్టుపక్కల నాయకులు రాజశేఖర్ మృతదేహాన్ని ఘనంగా నివాళులర్పించారు. బుధవారం రాజశేఖర్ స్వగ్రామమైన అంపిలిలో నాగావళి నది సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీమంత్రి పీడిక రాజన్న దొర, విజయనగరం జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర పంచాయతీచైర్మన్ పల్లా ప్రతాపు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్‌పి ముఖ్య నేతను కోల్పోయామన్నారు. రాజకీయంగా ఎనలేని సేవలు అందించారని,ఆయనలోని లోటు తీరని పేర్కొన్నారు.


రాజశేఖర్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ


పాలవలస కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పేదలకు వస్త్రదానం



రేగిడి... పేదలకు వస్త్రదానం చేస్తున్న చిరంజీవి నాయుడు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని లింగాలవలసలో అడపా చిరంజీవి నాయుడు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా బుధవారం సుమారు 400 మందికి వస్త్రదానం చేశారు. తన తల్లిదండ్రులు అడపా సత్యం నాయుడు, సీతమ్మ పేరిట గత పదేళ్లుగా సంక్రాంతి సందర్భంగా వస్త్రదానం చేస్తున్నారు. కార్యక్రమంలో సైలాడ రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : తంగుడుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం గంట్యాడ మండలం కొత్తవెలగాడ గ్రామంలో దళితవాడలో 20 మందికి దుస్తులు పంపిణీ చేశారు.

రామభద్రపురం : మండలంలోని ఆరికతోటలో సంక్రాంతి సందర్భంగా సుమారు వెయ్యి మంది పేదలకు మేలుకొలుపు బృందం దుస్తులను పంపిణీ చేసింది. దశాబ్ద కాలంనుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మేలుకొలుపు బృందం ఆధ్వర్యంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి భోగి పండగ వరకు తెల్లవారుజామున గ్రామంలో భజన కీర్తనలు ఆలపిస్తూ ప్రజల నుంచి కానుకలు స్వీకరించారు. వాటి నుంచి వచ్చిన నిధులు పోగు చేసి పేదలకు వస్త్ర దానం చేశారు.



నెల్లిమర్ల.. దుస్తుల పంపిణీ చేస్తున్న బంగారయ్య : రామభద్రపురం.. దుస్తులు పంపిణీ చేస్తున్న మేలుకొలుపు బృందం సభ్యులు


కబడ్డీ క్రీడాకారులను సన్మానిస్తున్న సర్పంచ్ వెంకటరమణ, నాయకులు

కబడ్డీ క్రీడాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-శృంగవరపు కోట

మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులు లగుడు అజయ్ కుమార్, పతివాడ వినయ్ కుమార్, కబడ్డీ కోచ్ ఆల్తి తాతబాబును సర్పంచ్ యాళ్ల వెంకటరమణ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాళ్ల వెంకటరమణ మాట్లాడుతూ సౌత్ జోన్ కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచి గ్రామానికి పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టారని ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగి కొసరి రామారావు, ఎంపిటిసి బోదల దేముడు, ఆల్తి బుచ్చిబాబు, విశాఖ డెయిరీ పాలకేంద్రం ప్రెసిడెంట్ ఆల్తి రమణ, తానవరపు అప్పలనాయుడు, కబడ్డీ క్రీడాకారులు టొంపల అప్పన్న, మత్తి గురుమూర్తి, మండల సతీష్, సారిక కోటారావు, తదితరులు పాల్గొన్నారు.